సహాయం

అప్పుడు మధ్యాహ్నం పన్నెండు గంటలవుతుంది. జానకిరామయ్య పెద్ద బజారు నే నడిచి వెళుతున్నాడు. అది భాద్రపద మాసం. వానలు కురిసినప్పుడు కురిసినా, ఆవాళ ఎండ చురుగ్గా కాస్తున్నది. బజారు అటూ యిటూ రెండుపక్కలా దుకాణాలు. కొన్ని దుకాణాలు తలుపులుమూసి భోజనానికి వెళ్ళారు. కొన్ని దుకాణాలు తీసి వున్నవి. జానకిరామయ్య అట్లా నడుస్తూ "ఓరి! వీడి తస్సాదియ్యా! మళ్ళాకొట్టు పెట్టాడే!" అనుకున్నాడు. ఆకొట్టు ఆసామి అమ్యో తనపని అయిపోయిందంటూ బాకీ దార్లకు రూపాయికి పావలాలిచ్చి కొన్నాళ్లు కొట్టు కట్టివేసి మళ్ళా జోరుగా వ్యాపారం చేస్తున్నాడు.

జానకిరామయ్య పక్కవీధి మలుపు తిరిగాడు. ఆ మొత్తనవున్న గడియారాల షాపులో యెవరో ఘర్షణ పడుతున్నారు. జానకిరామయ్య తలవంచుకుని నడిచి పోతున్నాడు. ఆవీధిలో షాపులేమీ లేవు. అన్నీ కాపురం చేసేయిళ్లు. ఇళ్ల ముందు బిచ్చగాళ్లు తినగా మిగిలిన మాడో మెతుకో వెయ్యమని గోలపెడుతున్నారు. జానకిరామయ్య ఆగల్లీ మలుపు తిరిగి కోనేటి వీధి నే నడుస్తున్నాడు.

అది పెద్దకోనేరు. బజారును అనుకొని వున్నది. అట్లా వెళ్తున్న జానకిరామయ్యకు అవతలి వైపునుంచి "మనిషి పడ్డది! మనిషి పడ్డది!" అని హాహాకారాలు వినరాగా చప్పున ప్రక్కగా రెండడుగులు వేసి కోనేరుకేసి చూశాడు. ఎవరో స్త్రీ నీటిలో పడి మునకలు వేస్తున్నది. అది చరిత్ర ప్రసిద్ధమైన క్షేత్రం. కొండమీద పానకాల స్వామిని దర్శించుకోడానికి ప్రతి రోజూ యెక్కడెక్కడనుండో యాత్రికులు వస్తూవుంటారు. వచ్చిన యాత్రికులు వేళాపాళా అనేది లేకుండా యెప్పుడు పడితే అప్పుడు ఆకోనేట్లో స్నానాలు చేస్తూ వుంటారు. అప్పుడు జానకిరామయ్య వెనకా ముందూ చూడకుండా గబగబా కొన్ని మెట్లుదిగి చొక్కా వుత్తరీయం అక్కడ పడవేసి, అందులో నిర్మించిన ఆంజనేయ స్వామి గుడిమీద నుంచి అమాంతంగా నీటిలో వురికి ఆస్త్రీని వొడ్డుకు చేర్చాడు. ఇంతలో వీధి నే అటువెళ్లేవాళ్ళు, ఇటు వెళ్ళేవాళ్లు అక్కడ చేరుకున్నారు. ఒడ్డుకు చేర్చిన స్త్రీని మెట్టు మీద పడుకో పెట్టారు. పడ్డవెంట నే తియ్యడం వల్ల ఆ స్త్రీ నీళ్ళెక్కువ తాగలేదు. ఉపచారాలు చెయ్యగా కళ్ళువిప్పి చూసింది. జానకిరామయ్య సంతోషానికి మేరలేదు. ఒకప్రాణి తనచేత రక్షింపబడ్డందుకు జానకిరామయ్య హృదయం ఆనందంతో నిండిపోయింది. అక్కడవున్న వాళ్ళంతా జానకిరామయ్య సాహసాన్ని మెచ్చుకున్నారు. ఇంకా కొంతసేపటికి ఆస్త్రీ లేచి కూర్చుంది. "ఏవూరమ్మాయి మీది?" అని అడిగాడు జానకిరామయ్య.

"నరసరావుపేట" అన్నది హీనస్వరంతో. ఆ అమ్మాయి, ఆయాస పడుతూ, సరిగా మాట్లాడలేక పోతున్నది. అక్కడవున్న

అందే నారాయణస్వామి

వాళ్ళు కొన్ని ప్రశ్నలు అడిగినా చెప్పలేక పోయింది. చూస్తే ఆ అమ్మాయి సాయంత్రానికిగాని సరిగా తేరుకునేటట్లు కనబడలేదు. అప్పుడు జానకిరామయ్య "ఇది పరస్థలం, యిక్కడ నీకెవరమ్మా? మాయింటికి వెడదాం" రమ్మని ఆ అమ్మాయిని బండి మాట్లాడి యెక్కించుకుని తన యింటికి తీసుకెళ్లాడు.

వాకిటిముందు బండి నిల్చింది. ఆ అమ్మాయి బండిదిగి జానకిరామయ్య వెనకాలే యింట్లోకి మెల్లిగా అడుగులు వేస్తూన్నది. అది పెంకుటియిల్లు. ముందు వసారా. యింటి ముందు వున్న తాటాకు పందిరికి ఘన్న జాజులచెట్టు అల్లుకుంటున్నది. వసారాలో జానకిరామయ్య భార్య జయలక్ష్మి తీరిగ్గాకూర్చుని మాదితో బట్టలు కుడుతున్నది. జానకిరామయ్య ఆ అమ్మాయిని వసారాలోకి తీసుకెళ్ళి భార్యతో ఇవాళ "యీ అమ్మాయి చచ్చి బ్రతికింది! కాలుజారి కోనేట్లో పడిపోయింది. యింకా కాస్త ఆలస్యం అయితే దక్కేదికాదు. అదృష్టవంతురాలు. వెంటనే దాక పైకి తీశాను" అని చెప్పాడు.

జయలక్ష్మి జాలిగా "అయ్యో! పాపం!" అన్నది. జానకిరామయ్య దగ్గరగా ఆ అమ్మాయి నీరసంగా నిలబడి వుంది. ఆ అమ్మాయిని యెక్కడో చూసినట్టు వుండడం వల్ల జయలక్ష్మి ఆ అమ్మాయికేసి పరకాయింపుగా చూస్తున్నది. కాసేపట్లో ఆమె కళ్ళు మెరిసినవి. "మీ అమ్మపేరు రుక్మిణి కదు అమ్మాయీ?" అని అడిగింది.

"ఊఁ" అన్నది నీరసంగా ఆఅమ్మాయి.

"నువ్వటే నా తల్లి! యివాళ నీకు యెంత గణ్డం తప్పింది! మీ అమ్మావాళ్లు ఏ వూళ్ళో వుంటున్నారు?" అని అడిగింది జయలక్ష్మి.

"నరసరావుపేటలో"

"అట్లాగా! మా పుట్టిల్లు తాడికొండ. మీరు తాడికొండలో వుంటున్నప్పుడు మీ అమ్మకూ నాకూ యెంతో స్నేహం. నువ్వూ మీ అమ్మ కలసి మావాళ్ల యింటికి యెన్నోసారు వచ్చారు! నన్ను మర్చిపొయ్యావా? నీ పేరు ఇందిర కదూ?" అని అడిగింది.

ఆ అమ్మాయి ముక్తసరిగా "ఊఁ" అన్నది.

"మీరు అక్కడినించి వెళ్ళిపొయ్యాక లేదుగాని అదివరకు మీ అమ్మకూ నాకూ యెంతో స్నేహం. మీ అమ్మ 'మా ఇందిరకు పెళ్ళి చెయ్యాలి. మంచి సమ్మంధాలు దొరకడంలేదని యెప్పుడూ నీ సంగతే చెపుతూ వుండేది. నీ పెళ్ళి ప్రయత్నాలు జరుగుతూ వుండగానే మీనాన్నకు అక్కడి నుంచి బదిలీఅయింది — పాపం! బిడ్డ మాట్లాడలేకుండా వుంది! నీటిలో పడడం వల్ల ప్రాణం యెంత దిమ్మరపోయిందో!" అంటూ జయలక్ష్మి ఆ అమ్మాయిని యింట్లోకి తీసుకెళ్ళి తన చీర యిచ్చి వంటిమీద వున్న తడిబట్టను విడిపించి అక్కడనే మంచం వాల్చి "పడుకో అమ్మా! యెంత హైరానా పడిపొయ్యావో!" అనగా ఆ అమ్మాయి మంచంమీద పడుకున్నది.

"అయితే అమ్మా! నువ్వు వస్తున్నది అత్తవారింటి దగ్గర్నించా? పుట్టింటి దగ్గర్నించా" అని అడిగింది.

"పుట్టింటి దగ్గర్నించి"

"అయితే నీ వెంట మీ అమ్మగానీ, బంధువులుగాని యెవరూ రాలేదా?" అని అడిగింది.

"ఊఁహుఁ"

"అట్లయితే మీ అమ్మ యిరుగుపొరుగువాళ్ళు వస్తూవుంటే జతచేసి పంపిందన్నమాట! యిదేం చోద్యమమ్మా! వెంట పంపిన వాళ్ళు యెంత జాగ్రత్తగా వుండాలి వదిలిపెట్టి వూరుకోడమేనా! అసలే కోనేరు మెట్లు పాచిపట్టి వుంటవి, వురికినే కాలు జారుతుంది" అంటూ ఆ అమ్మాయికి బిడ్డకంటే యినుమిక్కిలిగా వుపచారం చెయ్యడం మొదలుపెట్టింది. అదంతా చూస్తున్న జానకిరామయ్య అనుకోని ఆ బాంధవ్యానికి

ఆనందపడిపోయ్యాడు. జయలక్ష్మి ఆఅమ్మాయికి వేడివేడి జావకాచి యివ్వడంవల్ల కొంత కునుకుపటగా, వసారాలోకి వచ్చి ఆ అమ్మాయిని గురించే తలపోసుకుంటూ తాను వదిలివెళ్ళిన కుట్టుపని పూర్తిచెయ్యడం మొదలుపెట్టింది. జానకిరామయ్యవసారాలో భార్యపక్కగా మంచం వేసుకుని నడుం వాల్చాడు.

ఇంతలో పోస్టుజవాను వచ్చి వుత్తరం యిచ్చి వెళ్ళిపోయ్యాడు. జానకిరామయ్య చూసుకోగా అది దుగ్గిరాలనించి కూతురు వ్రాసినది. ఏదో తొందరలోవుండి వ్రాసినట్టుగావుంది. రెండుమాటలు వున్నవి.

"ప్రియమైన నాయనగారికి, నమస్కారములు

నా సవతి చనిపోయింది. అందువల్ల మాకు కొన్ని చిక్కులు యేర్పడ్డవి. ఆయనగారు కుప్పకూలి కూర్చున్నారు. 'ఈ వుత్తరం చూసిన తక్షణం నీవు రావలెను.

ఇట్లు,
సుశీల."

ఉత్తరం చదువుతుంటే జయలక్ష్మి "యెక్కడిదండీ ఆ వుత్తరం?" అని అడిగింది. జానకిరామయ్య "అమ్మాయి వ్రాసింది." అని భార్యకు వుత్తరం చదివి వినిపించి, "చస్తేయేమో! ఇతడు కుప్పకూలి కూర్చోవడం దేనికో! చిక్కులు కలిగినవని వ్రాసింది ఏమిటో ఆ చిక్కులు?" అన్నాడు.

"వెళ్ళిరాండి అదేమిటో తెలుస్తుంది. బిడ్డ నీళ్లుపోసుకుందని యెప్పుడు తీసుకురావాలన్నా పడడమేలేదు." అన్నది.

అప్పుడు మూడుగంటలవుతుంది. మంగళగిరినించి దుగ్గిరాలకు రెండుగంటల ప్రయాణం. నాలుగు గంటలకు బండివుంది. మంగళగిరి స్టేషనులో యెక్కితే చుట్టూతిరిగి పోవాలి. దాపులోవున్న పెద్ద వడ్లపూడిలో రైలెక్కితే సులభంగా చేరవచ్చు. అక్కడనుంచి అటువైపు వెళ్లేవాళ్ళంతా ఆమార్గానే వెళతారు. అక్కడ వడ్లపూడికి ప్రతిబండికీ జట్కాలు సిద్ధంగావుంటవి. జానకిరామయ్య చొక్కా వుత్తరీయం వేసుకొని బయలుదేరి వడ్లపూడిమీదగా దుగ్గిరాల చేరుకొన్నాడు. స్టేషనునుంచి కూతురుగారి యిలు చేరుకునేసరికి సందెపండింది. జానకిరామయ్య లోనికి వెళ్ళిచూస్తే హాల్లో యెవరూలేరు. అల్లుడు ఆవూళ్లో వుద్యోగం చేస్తున్నాడు. రెండు వందలజీతం, హాల్లో కుర్చీలు ఖాళీగావున్నవి. సరాసరి వంటగదిలోకి వెళ్లాడు. కూతురు అక్కడ యేదో పనిచేస్తున్నది. వచ్చిన తండ్రిని చూసి "వచ్చావా నాన్నా!" అంటూ కుర్చీ తెచ్చివేసింది. అతడు కూర్చున్నాడు. సుశీలముఖం యెన్నాళ్ళనాడో అన్నం తిన్నట్టు వాడిపోయివున్నది. "ఏమిటమ్మా అర్జంటుగా రమ్మని రాశావు?" అన్నాడు.

సుశీల ఆవేదనగా "అవును నాన్నా! యెంత యిది జరిగింది! నా సవతి చనిపోయింది. అసలే వాళ్ళకూ, వీళ్ళకూ సరిపడదాయె. పుట్టింటివాళ్లు మా పిల్లను మాకు చూపించమని మాయింటిమీదకు వచ్చారు. పెద్దరగడ జరిగింది. ఈయనగారు కుప్పకూలి కూర్చున్నారు." అని చెప్పింది.

"మీసవతి పుట్టింటివద్దనే వుంటున్నదిగా! ఇక్కడికి యెట్లావచ్చింది?" అని అడిగాడు.

"దాదాపు నెలరోజులక్రిందట ఒకనాటి వుదయం నాసవతి కూలివాడిచేత ట్రంకు పెట్టె మోయించుకుని లోపలకు వచ్చింది. అప్పుడు వారు యింటివద్దలేరు. ఆఫీసుకు వెళ్ళారు. ఆమె లోనికివచ్చి కూలివాడికి డబ్బుయిచ్చి పంపి యెంతో స్వతంత్రం వున్న యిల్లులాగా పెరట్లోకివెళ్ళి తానే చెంబుతో నీళ్ళుముంచుకుని కాళ్ళు కడుక్కుని నేనువున్న వంటగదిలోకి వచ్చింది. అప్పటికి ఆమె యెవరో నాకు తెలియదు"

జానకిరామయ్య అడ్డువచ్చి "మనకేం తెలుసు? ఎప్పుడన్నా వాళ్ళముఖం ఎరుగున్నాంగనకనా!" అన్నాడు సుశీల చెప్పుకుపోతున్నది. "అప్పుడు ఎవరా యీ చుట్టం అని తెల్లపోయి ఆమెకేసి చూస్తుంటే ఆమె నన్ను పలకరించి ఫలానా అని చెప్పింది. అప్పుడు నేను కూర్చో అక్కా అని కుర్చీ వేశాను. ఆమె కూర్చోలేదు. చిరపరిచితులతో మాట్లాడినట్టు 'శైలీ! పుటింటివద్ద వుంటే ఆడదానికి యేం గౌరవం? అంతా తేలిగా మాట్లాడుతారు. ఆఖరకు పుటింటివాళ్ళకు గూడా వెక్కసమైపోతాం! యెక్కడ పడ్డామో అక్కడే దేవులాడుకోవాలి' అంది. 'నిజమేఅక్కా'అన్నాను.

అక్క యెంతమంచిది నాన్నా! ఇంటిపనులు అందుకుని నాకు సహాయంచెయ్యడం మొదలుపెటింది. పన్నెండు గంటలకు వారు యింటికి భోజనానికి వచ్చారు. అక్కను చూసి ఆయన అదేమి అని అనలేదు. రోజూ భోజనంచేసి కాసేపు విశ్రాంతి తీసుకునేవారల్లా ఆవాళ భోజనంచెయ్యగానే ఆఫీసుకు వెళ్ళిపోయారు."

'మంచి పని చేశాడు' అనుకున్నాడు జానకిరామయ్య మనసులో. సుశీల చెప్పుకెళుతున్నది.

అప్పటినుంచి రోజూ వేళకువచ్చి గొంతులో మెతుకులు వేసుకుని వెళ్ళి రాత్రికి ఇంటికి వచ్చేవారు. ఒకరోజున వారు ఉదయానే పెరట్లో స్నానంచేస్తున్నారు. నేను యేదో పనిమీద వున్నాను. అప్పుడు అక్క వారికి వళ్ళుతుడుచుకోవడానికి తుండుగుడ్డ తీసుకెళ్ళి యివ్వబోయింది. ఆయన పుచ్చుకోలేదు. నీళ్లు కారుతూనే ఆయన లోనికివచ్చి మరో తుండుగుడ్డ తీసుకుని వళ్ళు తుడుచుకున్నారు. అప్పుడు అక్క భోరుమని యేడుస్తూ 'మీకూ మీకూ శత్రులు వుండవచ్చు. నేనేం చేశాను? నావల్ల అపరాధం ఏమిటి చెప్పండి? మీరే కావాలని వాళ్లను వదలుకుని వచ్చాను. మీరు మరో పెళ్ళి చేసుకున్నారనిగూడా నాకు యెంతమాత్రం లేదు.' అని వాపోయింది. ఆయన చలించలేదు. ఈ నెలరోజుల్లో వారిని ప్రసన్నం చేసుకోవాలని అక్క విశ్వప్రయత్నం చేసిందిగాని లాభం లేకపోయింది."

'బుట్టలో వేసుకోవాలంటే ఎలా వీలవుతుంది' అనుకున్నాడు మనసులో జానకిరామయ్య. అప్పటికి ప్రొద్దుకూకడంవల్ల సుశీల స్విచ్చివేసి లైట్లు వెలిగించి చెప్పసాగింది.

"అక్క రెండురోజులకు చచ్చిపోతుందనగా ఆమె మెళ్ళోవున్న బంగారంగొలుసు తీసి నామెళ్ళో వేసింది. 'ఎందుకులే అక్కా' అని నేనగా 'తీసుకుంటాలే చెల్లీ వుంచు' అన్నది. ఆసాయంత్రం నేను పొయ్యి దగ్గర కూర్చుని గారెలు వండుతున్నాను. అక్క తడిగుడ్డలమీద గారెలుచేసి నాకు అందిస్తున్నది. అక్క రోట్లో పిండంతా రుబ్బుకొచ్చింది. అట్లా గారెలుచేసి నాకందిస్తూ 'చెల్లీ నీకు అమ్మాయి పుడుతుందో, అబ్బాయి పుడతాడో మరి. పాపను నాకు చూసుకునే యోగ్యతవున్నదో లేదో' అంది. ఆమాటలు అంటూంటే ఆమె కళ్లు చెమ్మగిల్లినవి. అప్పుడు నేను 'అదేమిటి అక్కా అట్లా అంటావు. నువ్వులేకుండా ఏదిజరుగుతుంది'

సిక్కిం లాటరీ

టిక్కెట్టు రు. 1-10-0.

టిక్కెట్లు ఎత్తు తేది 31-1-58

టిక్కెట్లు అమ్మట ముగింపు తేది 31-12-57

మొదటి ప్రయిజు రు. 55000; రెండవ ప్రయిజు రు. 14000; మొత్తం ప్రయిజులు 500; ప్రయిజుల మొత్తం రు. 100000 లకు పైన 2 టిక్కెట్లు రు. 3-2-0; 3 టిక్కెట్లు రు. 4-6-0; 4 టిక్కెట్లు రు 5-0-10. వి. పి లేదు. ఆలస్యముగా వచ్చు ఆర్డర్లు అంగీకరించబడవు. మీ అడ్రసును మనియార్డరు ఫారముపై పెద్ద అక్షరాలతో వ్రాయండి. ఫలితముల లిస్టు కొఱకు 1 అణాను ఎక్కువ పంపండి. నేడే పంపండి.

బి. రామకృష్ణ,
అనుమతి పొందిన ఏజెంటు;
పాండురంగాళయవీధి, యాడికి, ఆంధ్ర.

సవతి

అన్నాను. ఆ మర్నాడు రాత్రి వాడుక ప్రకారం మేము గదిలో పడుకున్నాము. అక్క హాల్లో పడుకున్నది. అప్పుడు పన్నెండు దాటుతుంది. తలుపు తీసుకుని బయటికి వచ్చాను. అక్క కూర్చుని యేడుస్తున్నది. నన్ను చూసి నేనేమన్నా అనుకుని పోతానని అక్క యేమీ ఎరగనట్టు పడుకున్నది. నామతి మన్నుగాను! అప్పుడైనా ఆమెను ఓదార్చి మనసు మళ్ళించాను కాను. ఇంతకీ నాకాబుద్ధి పుట్టలేదు. ఇది జరిగి యివ్వాళకు నాలుగు రోజులేమో అవుతుంది అంతే. ఆ ఉదయం చూస్తే అక్క యింట్లో లేదు. ఎక్కడకైనా వెళ్ళిందేమోఅనుకున్నాను. ఆ సాయంత్రం వరకూ రాలేదు. పుట్టింటికి వెళ్ళిందని అనుకుందామంటే ఆమె గొలుసు నా మెళ్ళోనే వున్నది. ఆమె ట్రంకుపెట్టె కూడా యిక్కడేవున్నది. ఎట్లావెళుతుంది? నాకూ అనుమానం హెచ్చింది. ఆ మర్నాడు అక్క కాలవలో పడ్డదని చూసినవాళ్ళు చెప్పారు. నాకు దుఃఖం ఆగలేదు. ఈ సంగతి గ్రామమంతా అట్టుడికినట్టు వుడికిపోయింది. అక్క యెంతమంచిదనుకున్నావు నాన్నా? మరచినా మరపురావడం లేదు. నేను పొట్టి మనిషిని కానని, నన్ను యేపని ముట్టుకోనిచ్చేది కాదు. ఇక్కడ వున్నన్నాళ్ళు ఇంటిపనులన్నీ తానేచేసింది"

జానకిరామయ్య అడ్డువచ్చి "ఏంచేస్తామమ్మా? ఇటువంటివి జరుగుతూవుంటవి. మీ సవతి పడాలనిపడ్డదా! ఇవాళ మనవూళ్ళో ఒకఅమ్మాయి కోనేట్లో స్నానంచేస్తూ, బిల్లీటుగా నీట్లోపడిపోయింది. సమయానికి నేనటువెళుతూ దిగి తియ్యబట్టి సరిపోయింది గాని లేకపోతే యేముంది?" అన్నాడు సగర్వంగా.

"ఆయువ నేది వుంటే ఎవరైనా అట్లాగే తటస్థపడతారు. అక్క చచ్చిపోయిందన్న వార్త వినేసరికి వారు కుప్పగూలిపొయ్యారు. ఎట్లయినా మనస నేది నిలుస్తుందా? ఆఫీసుకు గూడా వెళ్ళడం మానివేశారు. ఈ సంగతి తెలిసి అక్కపుట్టింటివాళ్ళు వుద్రేకంతో మాయింటిమీదకువచ్చి 'పిల్లను ఏంచేశారు? దానిదగ్గర నగలన్నీ అపహరించి గొంతుపిసికి కాలవలోపారేస్తారా? యిరవైవేలకైనా దాని దగ్గర నగలున్నవి. ఇది వూరికేపోతుందనుకున్నారా?' అని కేకలువేసి వెళ్ళారు. అసలే వాళ్ళకూ వీళ్ళకూ సరిపడదు. కక్షతీర్చుకునేటందుకు వాళ్ళకు అదనుచిక్కింది. వాళ్ళు కేసుపెట్టారని తెలిసిందినాన్నా! కొంపమునిగేటట్టువున్నదిచూస్తే! అక్కగొలుసు నాదగ్గరేవున్నది." అంటూ పెట్టెలోనించి గొలుసుతెచ్చి తండ్రికిచూపించింది. జానకిరామయ్య గొలుసును పరకాయించి చూసి "దీనిమీద వాళ్ళపేరుగూడ వుందమ్మా! ఇది గనక వాళ్ళకు చిక్కిందంటే కొంపమునుగుతుంది! అధికారులకు చెవులేగాని కళ్ళెక్కడివి? దున్నపోతు యీనిందంటే గాటకట్టెయ్యమంటారు! మీరుజాగ్రతగా వుండటం అవసరం! ఇంతకీ రాఘవరావు యేమంటాడు?" అన్నాడు.

"అదిగో ఆగదిలో కూర్చున్నారు"అన్నది సుశీల.

* * *

రాఘవరావు గదిలో ఏకాంతంగా కూర్చుని మథనపడుతున్నాడు. భార్య మరణవార్త వినగానే అతనికి కనువిప్పుఅయింది. అతనిలో మానవత్వం మేలుకుంది "మీకూ మీకూ కక్షలువుంటే నేనేంచేశాను? నావల్ల అపరాధమేమిటి?" అని ఆరోజున ఆమెఅన్న మాటలు అతనిచెవుల్లో గింగురుమంటున్నవి. తన తప్పులన్నీ కళ్ళకు కట్టినట్టుకనపడసాగినవి. డబ్బుకోసం ఒకఅమాయికను బలిచేశాడు! త్రికరణశుద్ధిగా తననే నమ్ముకున్న అర్ధాంగిని పాటను పెట్టుకున్నాడు! తనను ప్రసన్నని చేసుకోవాలని ఆమెఎంత మొరపెట్టుకున్నా పెడచెవిని పెట్టాడు! అతనిమనసు పరిపరి విధాల పోసాగింది.

జానకిరామయ్య గదిదగ్గిరికి వచ్చిచూస్తే తలుపు వోరగా వేసివున్నది. తలుపునెట్టుకుని లోనికివెళ్ళి యేదోఆలోచిస్తూ మంచంమీద కూర్చునివున్న అల్లుడిసరసనకూర్చుని "ఏమిటి యిదంతా? మొన్న వాళ్ళు యింటిమీదికి వచ్చారటగా! దాన్నిగురించి ఏం ఆలోచించావు?" అని అడిగాడు.

"ఇంకా యేమీ ఆలోచించలేదు" అన్నాడు రాఘవరావు.

"వాళ్ళేమో నగలుఅపహరించి గొంతుపిసికి కాలవలో పారేశారని కేసుపెట్టి తలకిందులు చెయ్యాలని కూర్చుంటే మనం కాస్త ముందుగా జాగ్రత్తపడకపోతే యెట్లా?" అన్నాడు జానకిరామయ్య.

"అదే ఆలోచిస్తున్నాను" అన్నాడు రాఘవరావు.

"ముందుగా మేలుకోవాలిగాని నెత్తిమీదికివచ్చాక అనుకుంటే యేంలాభం? తెలిసినవాళ్ళను ఎవరినైనా అడిగి మనజాగ్రత్తలో మనం వుండాలి" అన్నాడు జానకిరామయ్య.

"నావొంట్లో బాగుండలేదు. మీరు కాస్త—"అని వాక్యాన్ని మధ్యలో ముగించాడు రాఘవరావు.

అంతటితో జానకిరామయ్య బయటకు వచ్చేశాడు. కూతుర్ని పిలిచి "అతడు శ్మశాన వైరాగ్యంలో వున్నాడు! అతని కేమీ పట్టినట్టులేదు! నామీదే వదిలాడు. ఇదంతా చూస్తే, చుట్టమై చూడొచ్చి దయ్యమై పట్టినట్టుగా వుంది! తలవని తలంపుగా ఆపద రావడం ఏమిటి? ఇట్లా జరగడం ఏమిటి?— పెద్దనాన్న కొడుకు శేషగిరిరావు గుంటూర్లో ప్లీడరుదగ్గర గుమాస్తాగిరిచేసి ఇప్పుడు మన వూళ్ళో బాగా ప్రయివేటు చేస్తున్నాడు. ఇటువంటి విషయాలు బాగా తెలుసు. వాడిని అడిగితే అంతా చెప్పేస్తాడు. చూస్తే నువ్వుగూడ ఏదో బెంగగా వుంటున్నావు. రెండు రోజులు వుండి వద్దువుగాని రామ్మా! నీకు మనశ్శాంతిగానూ వుంటుంది. అక్కడ శేషగిరిరావు అన్నయ్యను అడిగినట్లూ వుంటుంది" అన్నాడు.

ఆ మర్నాడు వుదయానే అల్లుడితో చెప్పి కూతుర్ని తీసుకుని బయలుదేరాడు. బస్సు పూడిలో దిగి ఇద్దరూ గుఱ్ఱబండి ఎక్కి ఊరు చేరుకునేటప్పటికి వుదయం పదిదాటింది. ఊరి వెలపల హరిజనగూడెం, రామమందిరం దాటి బండి బజారు నేపోతున్నది. బండి వాళ్ళ ఇంటిముందు ఆగింది. ఇద్దరూ బండి దిగి లోనికి అడుగులు వేస్తున్నారు. సుశీల కళ్ళు ముందుగా పందిరికి అల్లుకున్న సన్నజాజి చెట్టుమీదకి పోయినవి. చెట్టునిండా మొగ్గలు చాలావున్నవి. ఆ చెట్టును తానే వేసి పెంచింది. తాను పుట్టింటివద్ద వున్నన్నాళ్ళు ప్రతిరోజూ పూలుకోసుకుని తల్లో పెట్టుకునేది. సుశీల పందిరిదాటి వసారా ఎక్కింది. అక్కడ జయలక్ష్మి, ఇందిర కూర్చుని వున్నారు. సుశీల ఇందిరను చూసేసరికి కళ్ళు తెలియని సంతోషంతో "అక్కా" అని వెర్రికేక పెట్టింది. జానకిరామయ్య, జయలక్ష్మి విస్తుపోయి శిలాప్రతిమల్లా చూస్తున్నారు. సుశీల "దేవుడు రక్షించాడు అక్కా!" అని దణ్ణాలు పెట్టింది. ★